# ముకుందం గోవిందాల మృదంగ ఘటవాద్యాలు

ముకుందం గోవిందం అనే ఇద్దరు – గాఢ స్నేహితులు. ఒకరోజు ఆ ఇద్దరూ పాలూనీళ్లలాగా కలిసిపోయి, చిలకాగోరింకల్లాగా చెట్టాపట్టాలేసుకుని ఛంగుఛంగున గెంతే లేడిపిల్లల్లాగా ఉషారుగా, ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తూ ఉంటే ఒకచోట జనసమ్మర్దం అలలు అలలుగా లేస్తూ పడుతూ కనిపించింది. ఆ జనసమ్మర్దం ఎందుకలా కిటకిటలాడుతోందని కనుక్కోగా, ఆ లోపల సంగీత కచేరీ జరుగుతోందనీ అది దాదాపు పూర్తికావచ్చిందనీ, ప్రవేశం ఉచితం అనీ కొన్నివిశేషాలు తెలియగా ప్రాణమిత్రులిద్దరూ 'ఉచితం' అన్నమాటలో ఉన్న తియ్యదనాన్ని మిఠాయి కిళ్లీ నమిలినట్టు నమిలి, ఆహా అని ఆస్వాదిస్తూ కాస్సేపు కాలక్షేపం దొరికిందిగదా అని, భుజాలమీద చేతులు వేసుకుని, లోపలికి ప్రవేశించి ఖాళీగా కనిపించిన రెండు కుర్చీల్లో స్థిరపడ్డారు. సంగీతం పాడే ఆయన విశ్రాంతి పొందుతున్నట్టున్నాడు. మృదంగం, ఘటవాద్యకారులు ఒకరిమీద ఒకరికి కోపం, పంతం ఉన్నట్టుగా పోటీలుపడి వాయిస్తున్నారు. వాళ్ల వాద్యాన్ని వింటూ ముగ్ధులవుతున్న రసజ్ఞులు ఆహా అనీ, భేష్ అనీ, వహ్వా అనీ పలురకాల వాక్ప్రశంసలు కురిపిస్తున్నారు. మార్దంగికుడు, ఘటికుడూ ఇద్దరూ ఘటికులే గనుక, ఇద్దరూ సమస్థాయిలో సంగీతరసజ్ఞుల్ని మెప్పిస్తున్నారు. వాళ్ల చెవులకి పంచభక్ష్యభోజ్యాలూ వడ్డిస్తున్నారు. రసజ్ఞులు 'ఆహా' అంటే వాళ్లతోపాటు ముకుందగోవిందాలు కూడా 'ఆహా' అంటున్నారు. వాళ్లు చప్పట్లు కొడితే వీళ్లూ కొడుతున్నారు. మృదంగం వాయించే ఆయన మొత్తం అంతా దరువే కొడుతున్నా, మధ్యమధ్యలో ప్రేక్షకులు 'ఆహా' అని ఎందుకు మెచ్చుకుంటున్నారో వీళ్లకేమీ అర్థంకాక తికమకపడిపోతున్నా, ఆ వాద్య గోష్ఠిలో ఏదో ఆకర్షణ ఉండి వుంటుందని అక్కడే ఇంకాస్సేపుండి, 'అందరి ఆనందమే మా ఆనందం' అన్నట్లుగా ఆనందించి, వాద్యకారులిద్దరూ విరమించుకున్నాక, 'దదరినన్నా' అని గాయకుడు పాట ఎత్తుకున్నాక అందరితోపాటు చప్పట్లు కొట్టికొట్టి, మిత్రులిద్దరూ బయటపడ్డారు.

కొంతసేపు అలా కాళ్ల అడుగులతో రోడ్డు కొలిచాక మౌనవ్రతం చాలించి - ''ఆ వాద్యాల్లో ఏదో మహత్తు ఉంది. లేకపోతే అంతమంది అలా పరవశించిపోతారా'' అనుకున్నారు. ''మనం కూడా అలాంటి మెప్పులు పొందగలిగితే?'' అనుకున్నారు - ఇంకాస్సేపటికి. ఇద్దరూ రోడ్డుపక్కన ఉన్న తూము గట్టుమీద చతికిలపడబోయి, ఏమరుపాటున కిందపడి దులుపుకుంటూ లేచారు.

లేస్తూనే –

''ముకుందం'' అన్నాడు గోవిందం.

''గోవిందం'' అన్నాడు ముకుందం.

''మనం కూడా ఆ వాద్యాలు నేర్చుకోవాలి. అంతవాళ్లం కావాలి''.

''అవును అదే నా ఆలోచన కూడా''.

''నేను ఘటం నేర్చుకుంటాను. అది సులభంగా వచ్చేలా ఉంది'' అన్నాడు గోవిందం.

''కష్టమైనా ఫర్వాలేదు. నేను మృదంగం నేర్చుకుంటాను'' అన్నాడు ముకుందం.

''ఎవరిదగ్గర?''

''ఎవరో ఎక్కడుంటారో మనకి తెలీదుగనుక, వాళ్లకు ఫీజులు కట్టుకోవాలి గనుక, మనం కట్టలేంగనుక, వాళ్లు చెప్పిన టైములకి అక్కడికెళ్లాలి గనుక, మనం వెళ్లలేం గనుక మనంతట మనమే నేర్చుకుందాం''.

''అంతే''.

అంతే అంటే అంతే అనుకున్నారు.

''మన ఇద్దరం ఒక పందెం వేసుకుందాం. వేసుకున్నాం అంటే ఇద్దరం వాళ్లలాగే పోటీలుపడి, తొందరగా నేర్చేసుకోవచ్చు''.

''ఏమిటది?''

''నాది మృదంగం గదా. నీది ఘటంగదా. ఇద్దరం రేపట్నుంచీ ప్రాక్టీస్ ఆరంభించాలి. గురువులు నేర్పకుండా, ఆరునెలల్లో ఎవరు ముందు కచేరీ చెయ్యగలరో...పందెం''.

సై అంటే సై అనుకున్నారు. సైకిళ్లు లేకపోయినా ఉన్నట్టు భావించుకుని స్పీడుగా కాళ్లు తొక్కుకుంటూ ఇళ్ళకి పరుగెత్తారు.

ముకుందం, మృదంగంలాంటి పాతమద్దెల ఒకటి సంపాయించాడు. గోవిందం చిన్నకుండ కొన్నాడు. ఇద్దరూ వాళ్లవాళ్ళ ఇళ్లల్లో శుభముహూర్తం చూసుకుని గణపతి, సరస్వతి ఆది దేవుళ్లందరికీ తమ అభిలాష తెలియజేసి వాద్యాలు ఆరంభించారు. మొదటి దెబ్బకే ముకుందం మృదంగం - ముఖం చిట్లించింది! గోవిందం కుండమీద ఓ దెబ్బ వెయ్యగానే కుండ పగిలింది! నొప్పి పెట్టిన వేళ్లతో ఆ కుండ పెంకులు బయటపారేసి, ఇంకో కుండ కోసం బయల్దేరాడు గోవిందం.

కుండలకొట్టు దగ్గర ఓ కుండ తీసి దాని 'నాడెం' పరీక్షించాలని 'ఠాంగ్'మని దానిమీద మొత్తడంతో, సరిగ్గా మధ్యకి రెండు ముక్కలయింది ఆ కుండ!

''ఓరీ మహా పాతకుండా! నాకు పాతకుండ అమ్మెదవా?'' అని అమ్మినవాడి మీద కోప్పడ్డాడు గోవిందం. పాతో కొత్తో కుండ పగల గొట్టినందుకు డబ్బు చెల్లించాల్సిందేనని, కుండ పగలగొట్టినట్టు చెప్పేశాడు కుండలరావు. తొలిదెబ్బకే పగిలింది గనక ఇవ్వనని గోవిందం, దరువు ఎవడెయ్యమన్నాడని కుండలోనరూ వాదించుకున్నాక - ఓడిపోయిన గోవిందం చచ్చినట్టు డబ్బు చెల్లించి, రోడ్డున పడ్డాడు. ఇది లాభంలేదని ఘటవాద్యం కోసం వెతికివెతికి, తిరిగితిరిగి పగలని ఘటవాద్యం కొనుక్కొచ్చాడు.

ముకుందం ఆ మృదంగాన్నే మరమ్మతు చేయించి, చేతికొచ్చినట్టూ బట్టలుతికినట్టూ బాదసాగాడు.

వాళ్ళ నాన్నొచ్చి చెవులు మూసుకుంటూ నిలబడ్డాడు.

''ఏమిట్రా ఆ బాదుడు?'' అని అడిగితే, ఆర్నెలల్లో కచేరీ చెయ్యాలన్నాడు. 'ఇలా బాత్తే కచేరీ ఎలా చేస్తావురా - వెళ్లి నేర్చుకో నా నాయినా ఎక్కడయినా' అని, వాళ్ల నాన్న అన్నమాటని ఏమాత్రం పట్టించుకోకుండా మోగించడం సాగించాడు. 'ఇదేమిటీ గోల రోజూ, ఈ డప్పూ వీడూను. వీధిలోకి పోయి కొట్టమనండి. పైసో పావలో సంపాయించొచ్చు'' అని ముకుందం సవతితల్లి కోప్పడింది. పిన్ని అవమాన వాక్యం సహించలేక, ముకుందం వీధిగుమ్మంలోనే కూచుని మోదసాగాడు మద్దెల్ని. వీధిలో తిరుగుతున్న ఇద్దరు ముగ్గురు చిన్నకుర్రాళ్లు, గారడీవాడు వచ్చాడనుకునో, ఏదో మోత వినిపిస్తోందేమిటో చూద్దామనో వచ్చి ముకుందం చుట్టూ పదిమంది మూగినట్టు మూగారు.

''ఇదిగో చూడు బాబూ! నీకెవడిమీదేనా కోపం ఉంటే వెళ్లివాడిని చావగొట్టు. ఎందుకు పాపం ఆ మద్దెల్ని చెడామడా కొట్టి బాధిస్తావు?'' అని అడిగాడు పక్కింటాయన. ''ఆర్నెల్లలో కచేరీ చెయ్యాలి'' అన్నాడు ముకుందం వాయిస్తూ అలిసిపోతూనే.

''కచేరీ చెయ్యవు. ఆర్నెల్లు ప్రభుత్వ కచేరీలో కూచోబెట్టిస్తాను న్యూసెన్స్ కేసు పెట్టి. ఆపు నీగోల'' అని గట్టిగా కోప్పడ్డాడు ఆయన.

''నా ఇల్లు - నా మద్దెల - నా చేతులు - నా ఇష్టం. మీ ఇంటిదగ్గర దీపావళికి మీరు టపాసులు పేల్చి చప్పుళ్లు చేస్తే నేనొద్దన్నానా! కావాలంటే మీరూ ఓ మద్దెల కొనుక్కుని వాయించుకోండి. ఆర్నెల్లలో నాతో పోటీకి రండి'' అన్నాడు ముకుందం జోరుగా.

రెండురోజుల తర్వాత అవతలి ఇంటివాడూ, ఇవతలి ఇంటివాడూ ఐకమత్యాన్ని నమ్ముకుని, వెళ్లి పోలీసు రిపోర్ట్ ఇవ్వడంతో ముకుందం మృదంగవాద్యం తాత్కాలికంగా ఆగిపోయింది.

గోవిందానికీ అంతే అయింది. ఎప్పుడు వాయించినా, ఎక్కడ వాయించినా, ప్రతివాళ్లూ అతన్ని తిట్లతో వాయించడం మొదలెట్టారు. ఇక్కడ లాభంలేదని, ఊరవతల జనం తిరగనిచోట, ఒక పెద్దచెట్టుకింద ఒంటరిగా కూచుని అక్కడ ఘటం కొట్టడం మొదలెట్టాడు. దూరంగా పశువులు కాసుకుంటున్న కుర్రాళ్లు, మెల్లిగా దగ్గరగా వచ్చి చూసి, ''పిచ్చాడ్రా'' అన్నారు. ఓ కుర్రాడు రాయి విసిరాడు. ఆ రాయి సూటిగా వచ్చి దీటుగా వాద్యానికి తగిలి, దాన్ని పగలగొట్టింది. గోవిందం కోపం పట్టలేక చిన్నాభిన్నమైన ఆ వాద్యావశేషాలను, ఆ పిల్లలమీదికి విసురుతూ వెంట బడ్డాడు. పిచ్చివాడు తరుముతున్నాడని పిల్లలు గోలెత్తుతూ పరుగెత్తేసరికి, వాళ్ల పెద్దలు అట్నుంచి పరుగుపరుగున రావడంతో, వాళ్లచేతుల్లోని కర్రలు చూసి, గోవిందం తారెత్తి మళ్లీ వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తాడు ముందుకు.

ఆ ఊరికి రెండుమైళ్ల దూరంలో ఒక చిన్న శిథిల దేవాలయం ఉంది. ఆ ప్రాంతం అంతా నిర్మానుష్యంగా కూడా ఉంటుందనీ రోజూ ఉదయమే అక్కడ కూచుని సాధన చెయ్యొచ్చుననీ నమ్మిన ముకుందం, మృదంగంతో బయల్దేరి వచ్చేసరికి, అదే ఆలోచనతో గోవిందం కూడా ఘటసమేతుడై అక్కడికే వచ్చాడు. ఇద్దరూ వాద్యాలు కిందపెట్టి, సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులకుమల్లె - ''ముకుందం'' ''గోవిందం'' అంటూ కావలించుకుని తమ మొరలు చెప్పుకున్నారు.

''ఇక్కడయితే ఎవరిబాధా ఉండదు. ఇద్దరం అనుకోకుండా కలిశాంగనక పోటీ పడుతూ సాధన చెయ్యొచ్చు'' అని మంటపంలోని చెరోదిక్కునా ఇద్దరూ కూచుని వాయింపు మొదలుపెట్టారు. ఏనాడూ సందడి వినిపించని దేవాలయంలో తాళ వాద్యాలు వినిపిస్తున్నాయని దగ్గర్లో ఉన్న పల్లెవాళ్లు ఆత్రుతగా రాసాగారు. ఏనాడూ ఆలయంవేపు తొంగిచూడని మనుషులంతా గుంపులు గుంపులుగా రావడంచూసి, ఆలయ మాజీ అధికారి అక్కడకొచ్చి అదంతా వారిచలవే అని గ్రహించి, ఆ వాద్యకారులను అభినందించి సన్మానం చేయించాలనుకుని, అంతలో జనం తాకిడికి విరిగిపోయిన స్తంభాల్నీ, చిన్నమంటపాన్నీ గమనించి - ఇద్దరిమీదా విరుచుకుపడి - ''ఎవరు మీరు? ఎవరి అనుమతితో ఇక్కడికొచ్చారు? అసలే శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయం, మీ వాద్యఘోషకీ, ఆ ఘోష చూడవచ్చిన జనం తొక్కిడికీ మరింత కూలిపోతోంది. పొండి ఇక్కణ్నుంచి!'' అని కళ్లెర్ర చేశాడు. ఈ ఆశ కూడా అంతరించిపోవడంతో ఇద్దరూ జ్వరంపడి లేచిన వాళ్లలాగా నీరసించిపోయి ''ఇంటి కన్నా గుడి పదిలం'' అన్నారు గాని, ''గుడికన్నా ఇళ్లే పదిలం'' అనుకుని మళ్లీ వాళ్లిళ్లల్లోనే మెలిమెల్లిగా దరువులు ఆరంభించారు. ఈసారి ఇంట్లోవాళ్లు ఏ అభ్యంతరమూ పెట్టలేదని సంతోషించారుగాని, మర్నాడు ఉదయమే భోరుమని దుఃఖించారు. కారణం - ముకుందం మృదంగం మాయమైపోయింది! దొంగలే ఎత్తుకెళ్లారో మనుషులే మాయంచేశారోనని ఆలోచించి, అడిగితే ఎవరూ నిజం చెప్పడంలేదని రిపోర్ట్ ఇవ్వడానికి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాడు. అదే సమయానికి గోవిందం కూడా తన ఘటం దొంగలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు, చెయ్యడానికి వచ్చాడు. తనకంటె ముందుగా కచేరీచేసి పందెం కొట్టెయ్యాలన్న దురుద్దేశంతో ముకుందమే తన ఘటం మాయచేశాడని గోవిందం, అదే దురుద్దేశంతో తన మృదంగం మాయం చేశాడని ముకుందం - ఒకరిమీద ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. 'నువ్వెంత'ంటే 'నువ్వెంత' అనుకున్నారు. బాదుడు అలవాటయిన చేతులు రెండూ వీపులమీద మోతలు మోయించడం చూసి, పోలీసు అధికారి ఇద్దర్నీ బత్తాయి తొక్కల్లా విడదీసి - ''నాయన్లారా! మీ వాద్యాలు మీరూ మీరూ ఎత్తుకెళ్లలేదు. మీ వాద్యఘోష భరించలేక, మీవాళ్లో, చుట్టుప్రక్కలవాళ్లో కలసి, వాటిని రిక్షాలమీద తెచ్చి మాకు వప్పజెప్పారు. ఆ రెండూ ఇక్కడే, అదిగో ఆ 'సెల్'లో ఉన్నాయి'' అని చూపించాడు.

చెయ్యని నేరానికి జైల్లో శిక్ష అనుభవిస్తున్న తమ వాద్యాల్ని చూసి 'సెంటిమెంటల్ టచ్'తో భోరుమన్నారు. ''చూడండి బాబూ! మీ ఇష్టం వచ్చినట్టు మోతమోయిస్తే ఏ వాద్యమూ పట్టుబడదు. దానికో పద్ధతీ, విధానం ఉన్నాయి. గురువు బోధించ కుండా విద్యలు ఎలా నేర్చుకుంటారయ్యా? బాదేస్తే నిపుణత్వం వచ్చేస్తుందా? ఊరికే

బియ్యం, నీళ్లూ కలిపి పొయ్యిమీద పెట్టేస్తే అన్నం అయిపోతుందా? కాకీచొక్కా వేసుకుని టోపీ పెట్టుకుంటే పోలీసు అయిపోతాడా? అందువల్ల పద్ధతి ప్రకారం గురువుల దగ్గర నేర్చుకోండి'' అన్నాడు - రిటైర్ అవడానికి సిద్ధంగా ఉన్న ఆ పోలీసు అధికారి. ''అలాగే! మా వాద్యాలు మాకిచ్చేయండి పోతాం'' అన్నారిద్దరూ ఏక కంఠాన.

''ఇవ్వను. గురువుల్ని తీసుకురండి'' అన్నాడు పోలీసు అధికారి కచ్చితంగా. ముకుందం, గోవిందాలిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

''అయ్యా పోలీసు వారూ! ఇంక మాకు ఓపికలేదు. మాకు గురువులూ వద్దు, ఆ దురువులూ వద్దు. మమ్మల్ని మామూలుగానే బతకనీయండి. ఆ మృదంగ ఘటాలు రెండూ మీ దగ్గరే ఉన్నాయి గనుక, మీరే గురువును పెట్టుకుని ప్రాక్టీస్ చెయ్యండి. ఎలాగూ మీకు బాదడంలో అనుభవం ఉందిగనుక, ఆ వాద్యవిద్య చప్పున రావచ్చు. ప్రయత్నించండి'' అని ఇద్దరూ బయటికొచ్చి, ఒకర్నొకరు చూసుకుని, భోరుమని ఏడ్చి, ఒకరి కన్నీరొకరు తుడిచి, భుజాలమీద చేతులు వేసుకుని రోడ్డు కొలుస్తూ ఉండగా, ఓ చోట సంగీతసభ జరుగుతుండడం వినిపించింది. పొరపాటునైనా కాళ్లు అటు లాక్కెళతాయేమోనని, కంగారుపడి చెరో పక్కా పరుగెత్తి, వేరు సెనక్కాయలు కొనుక్కుని దూరంగా పారిపోయి - మళ్లీ కలిసి నిదానంగా నడవసాగారు - ముకుందం గోవిందాలు. □